క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భువనగిరి : పట్టణంలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ పట్టణ ఏఈ సాయికృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినాయక చౌరస్తా నుంచి పాత బస్టాండ్ వరకు రోడ్డుకు ఇరువైపులా విద్యుత్ టవర్స్ మీదికి ఎల్టీ లైన్ షిఫ్ట్ చేసే పనుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినాయక చౌరస్తా నుంచి పాత బస్టాండ్ వరకు, సస్తా బజార్, గాంధీ పార్కు, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, ఠాగూర్‌రోడ్, పాత బస్టాండ్, ఆర్బీనగర్, సంజీవయ్యనగర్, హన్మాన్‌వాడలోని గృహాలు, వ్యాపార, వాణిజ్య సముదాయాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. పజలు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

చౌటుప్పల్‌లో..

చౌటుప్పల్ : చౌటుప్పల్ పట్టణం-2, బంగారిగడ్డ, పీపల్‌పహాడ్, ఎల్లగిరి, మల్కాపురం, నేలపట్ల, తంగేడుపల్లి, ఆరెగూడెం ఫీడర్లలో 11కేవీ లైన్‌లకు అడ్డంగా ఉన్న చెట్ల తొలగింపుతో పాటు లైన్ల మరమ్మతు పనుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ ఆర్.సతీష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8గం. 30ని. నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

వలిగొండ: మండలంలోని వేములకొండ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని బుధవారం జిల్లా వైద్యాధికారి మనోహర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. అన్ని రకాల వ్యాధులకు సరిపడా మందులు నిల్వ ఉండేటట్లు చూసుకోవాలని వైద్యులకు సూచించారు. ఆయన వెంట వైద్యులు ప్రసిద్ధ, ఉమామహేశ్వరి, సిబ్బంది ప్రవీణ్ రెడ్డి, సత్తయ్య, రమేష్, ఏఎన్ఎంలు ఉన్నారు.

12న మెగా రక్తదాన శిబిరం

మోత్కూరు : మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని అంగడీబజార్‌లోని శ్రీ లక్ష్మీనర్సింహ ఆస్పత్రి ఆవరణలో ఇండియన్ రెడ్‌క్రాస్ మోత్కూరు శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 12న మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు ఓ.సత్యనాథ్, కార్యదర్శి మెట్టు మంగేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ యువజన దినోత్సవం, వివేకానంద జయంతిని పురస్కరించుకుని రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

సంస్థాన్ నారాయణపురం: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఏసీపీ మధుసూదన్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఎస్ఎస్‌పీఎల్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఉప్పల లింగస్వామి , ముద్దంగుల నరసింహ, మాజీ ఎంపీపీ గుత్త ఉమాదేవిప్రేంచందర్‌రెడ్డి, ఆర్గనైజర్లు ఉప్పల నాగరాజు, కొండ శ్రీకాంత్, పాలకుర్ల సతీష్, మందుగుల బాలకృష్ణ, ఏపూరి సతీష్, ఆనంద్, వీడెం సాయి కిషోర్, నవీన్ , రాజు, శ్రీహరి , శివ , రాములు, కృష్ణకుమార్ పాల్గొన్నారు.

వైభవంగా దీపోత్సవం

రామన్నపేట : మండలంలోని సిరిపురం శ్రీ సీతారామాంజనేయస్వామి దేవాలయంలో ధనుర్మాస ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయంలో దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో గోదా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. తిరుప్పావై పాశురం పఠించారు. అనంతరం నగర సంకీర్తన చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

తెలుగు సంప్రదాయానికి ముగ్గులు ప్రతీక



బహుమతులు అందజేస్తున్న మాతృ శక్తి ప్రముఖులు

భువనగిరి : తెలుగు సంప్రదాయానికి ప్రతీక ముగ్గులు అని విశ్వ హిందూ పరిషత్ జిల్లా మాతృ శక్తి ప్రముఖ్ బొక్క అరుణజ్యోతి అన్నారు. బుధవారం పట్టణంలోని విద్యానగర్‌లో విశ్వహిందూ పరిషత్ భువనగిరి మాతృ శక్తి విభాగంలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలకు నగదు, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా మాతృ శక్తి సేవా ప్రముఖ్ శ్రీదేవి, నాగమణి, శోభారాణి,సంధ్య, గంగా, లలిత, చామ రవీందర్ సహదేవ్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్ పోస్టర్ విడుదల

సంస్థాన్ నారాయణపురం: మండల కేంద్రంలో ఈ నెల 11నుంచి 13వ తేదీ వరకు నిర్వహించనున్న వాలీబాల్ టోర్నమెంట్ పోస్టర్‌ను బుధవారం గుడిమల్కాపురం మాజీ ఎంపీటీసీ, వాలీబాల్ టోర్నమెంట్ స్పాన్సర్ శివరాత్రి కవిత విద్యాసాగర్ ఆవిష్కరించారు. పోస్టర్ ఆవిష్కరణలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు భిక్షం, ఆర్గనైజర్లు సోమనబోయిన చంద్రశేఖర్, రాచకొండ గిరిబాబు, చిలువేరు శంకర్, రామకృష్ణ, శ్రీను, శ్రీకాంత్, మహిపాల్ పాల్గొన్నారు.

అసంపూర్తిగా పీహెచ్‌సీ భవనం

- సకాలంలో బిల్లులు రాక నిలిచిన పనులు
- వైద్యసేవలకు ఇబ్బందులు
- పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని వేడుకోలు



నిలిచిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణం

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలంలోని పంతంగి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులు బిల్లులు రాక అర్ధాంతరంగా నిలిచిపోయాయి. గత ప్రభుత్వం గ్రామాల్లో గల ఆరోగ్య ఉప కేంద్రాలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలుగా అప్‌గ్రేడ్‌చేసి వాటి భవన నిర్మాణాలకు రూ.20 లక్షల నిధులు మంజూరు చేసింది. ఇందులో భాగంగా చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామంలో ప్రాథమిక ఆర్యోగ్య కేంద్రం భవనం నిర్మించేందుకు నిధులు మంజూరయ్యాయి. భవన నిర్మాణానికి గ్రామ పంచాయతీ పరిధిలో 800 గజాల ప్రభుత్వం స్థలాన్ని కేటాయించింది. దీంతో 2023లో అప్పటి ప్రజా ప్రతినిధులు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. బిల్లులు సకాలంలో రాకపోవడంతో మధ్యలోనే పనులు నిలిచిపోయాయి. పంతంగి గ్రామంలో నిర్మిస్తున్న ప్రాథమిక ఆర్యోగ్య కేంద్రం పూర్తయితే పంతంగి గ్రామ ప్రజలతో పాటు ఆరెగూడెం, కాట్రేవ్, గుండ్లబావి, అంకిరెడ్డిగూడెం గ్రామాల ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుంది. అయితే భవన నిర్మాణం పూర్తి కాకపోవడంతో ప్రసుత్తం ఉన్న భవనంలో వైద్య సేవలు అందించడానికి ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

బిల్లులు రాక..

పంతంగి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి రూ.20లక్షలు కేటాయించారు. అయితే భవన సదరు కాంట్రాక్టర్ స్లాబ్ వరకు పనులు పూర్తి చేసి రూ.8 లక్షలు ఎంబీ రికార్డు చేయించుకున్నారు. అయితే ఈ బిల్లులు రాకపోవడంతోనే పనులు నిలిపివేసినట్లు తెలుస్తోంది. అయితే భవన నిర్మాణానికి మంజూరైన ఆరోగ్య విధాన పరిషత్ నిధులను కలెక్టర్ ఖాతాలో జమ అయ్యాయని అందువల్లే బిల్లుల మంజూరులో ఆలస్యమవుతుందని సంబంధిత అధికారులు తెలుపుతున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పనులు పూర్తి చేయాలి

పంతంగిలో నిర్మిస్తున్న ఆస్పత్రి భవనం నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలి. కాంట్రాక్టర్ సగం పనులు చేసి వదిలేశారు. చేసిన పనులకు కూడాబిల్లులు రాలేదని చెబుతున్నారు. అధికారులు స్పందించి భవన నిర్మాణ పనులు పూర్తి చేసి ఆస్పత్రిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతున్నాం.



– రత్నం శ్రీకాంత్, పంతంగి

అందుబాటులోకి తేవాలి

గ్రామంలో నిర్మిస్తున్న ఆసుపత్రిని పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. ఆస్పత్రి పూర్తయితే 5 గ్రామాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. భవన నిర్మాణం పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.



– బాతరాజు సత్యం, మాజీ సర్పంచ్. పంతంగి

గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



కొలనుపాకలో చెక్ డ్యామ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య

ఆలేరురూరల్ : గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య అన్నారు. బుధవారం ఆలేరు మండలంలోని కొలనుపాక వాగులో రూ. 3.46 కోట్లతో నిర్మించ తలపెట్టిన చెక్ డ్యామ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా కొలనుపాక ఎస్సీ కాలనీలో,గుండ్లగూడెం, శారాజీపేటలో సీసీ రోడ్డు పనులకు, ఆలేరులో రూ. 50 లక్షలతో నిర్మించనున్న మహిళ శక్తి భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి నుంచి రైతు భరోసా పథకాన్ని ప్రభుత్వం అమలు చేయనున్నట్లు తెలిపారు. అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తుందన్నారు. ఆయా కార్యక్రమాల్లో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చైతన్య, మదర్‌డెయిరీ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ సునీత శ్రీనివాస్‌రెడ్డి, నీలం పద్మవెంకటస్వామి, గందమల్ల అశోక్, వెంకటేశ్వరరాజు, తుంగ కుమార్, బుగ్గ నవీన్, లోకేష్, ఆంజనేయులు, ముదిగొండ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధే ధ్యేయం



మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవైస్ రహెమాన్ చిస్తీ

భువనగిరిటౌన్ : గ్రంథాలయాల అభివృద్ధే ధ్యేయమని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవైస్ రహెమాన్ చిస్తీ అన్నారు. జిల్లా గ్రంథాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గుండాలలో , వలిగొండ ,తుర్కపల్లి శాఖ గ్రంథాలయాల భవన నిర్మాణాలకు ఆమోదం తెలిపారు. ఆలేరు రామన్నపేట శాఖ గ్రంథాలయాల్లో భవన మరమ్మతులు, జిల్లా కేంద్ర గ్రంథాలయం, జిల్లాలోని శాఖా గ్రంథాలయాల్లో మౌలిక వసతులు కల్పించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ కె. సత్యనారాయణ, ప్రాజెక్ట్ ఆఫీసర్ అడల్ట్ ఎడ్యుకేషన్ ఎస్. మమత, జూనియర్ అసిస్టెంట్ జిల్లా పంచాయతీ కార్యాలయం, ఎం. శ్రీనివాస చారి, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సుధీర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆరుట్ల దంపతుల పోరాటం స్ఫూర్తిదాయకం



క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న బీర్ల అయిలయ్య, ఆరుట్ల ఫౌండేషన్ సభ్యులు

ఆలేరురూరల్ : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో ఆలేరు ప్రాంతం నుం చి ఆరుట్ల దంపతులు చూపిన తెగువ నేటితరానికి ఎంతో స్ఫూర్తిని కలిగిస్తుందని ఆలేరు ఎమ్మె ల్యే బీర్ల ఐలయ్య, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. ఆలేరు పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో ఆరుట్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీలు బుధవారం ముగిశాయి. ముగింపు సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం ఆరుట్ల దంపతులు అనేక పోటాలు చేశారన్నారు. దోపిడి వ్యవస్థను అంతం చేసేందుకు సాయుధ పోరాటాన్ని ఎంచుకుని ఆలేరు ప్రాంతానికి పేరు తెచ్చి పెట్టారని పేర్కొన్నారు. ఆరుట్ల వారుసులుగా కోడలు సుశీలదేవి, మనుమలు శ్రీకాంత్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి మనుమరాలు మమత కొనసాగిస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమలో హెడ్ మాస్టర్ దాసరి మంజుల, మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, ఎంఈఓ లక్ష్మి, క్రీడా కో కన్వీనర్లు గండసంతల మధుసూదన్, పూల నాగయ్య, ఉపాధ్యాయులు పోరెడ్డి రంగయ్య, మాదాని జోసఫ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

యాదగిరిగుట్ట : పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు బుధవారం ఎన్ఎస్ఎస్, ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యాదగిరిగుట్ట పట్టణ ట్రాఫిక్ ఎస్సై రాజు మాట్లాడుతూ.. విద్యార్థులు ట్రాఫిక్ నియమాలను పాటించాలన్నారు. లైసెన్స్, హెల్మెంట్ ధరించకుండా వాహనాలు నడపడం నేరమని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ పి. మంజుల, ప్రోగ్రాం ఆఫీసర్ రాంబాబు, ట్రాఫిక్ కానిస్టేబుల్స్, కళాశాల అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గో క్షేత్రంలో శత చండీయాగం

ఆలేరురూరల్ : ఆలేరు మండలంలోని కొలనుపాకలోని శ్రీమాతా పితృ గో క్షేత్రంలో బుధవారం చతురాయతన సహిత శతచండీయాగాన్ని హంపి పీఠాధిపతి, జగద్గురు శంకరాచార్య విద్యారణ్య భారతి స్వామి ప్రారంభించారు. బ్రహ్మశ్రీ పులి సీతారామ శర్మ ఆధ్వర్యంలో 16 మంది రుత్వికులతో 5 రోజుల పాటు జరుగుతున్న శతచండీ యాగం మొదటి రోజు చండీ పారాయణ, సహస్రమోదక గణపతి హోమం, లక్ష కుంకుమార్చాన పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో శ్రీమాతా పితృ గోక్షేత్రం సారధి బిజుమళ్ల బిందుమాధవ శర్మ, పలువురు భక్తులు పాల్గొన్నారు.

చేనేత డిజైన్ కోర్సులు ప్రారంభించాలని వినతి

భూదాన్‌పోచంపల్లి : స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో చేనేతకు సంబంధించిన నూతన డిజైన్ కోర్సులను ప్రారంభించాలని కోరుతూ పోచంపల్లికి చెందిన చేనేత నాయకులు ఏలే భిక్షపతి, బోగ నర్సింహ బుధవారం సంస్థ చైర్మన్ డాక్టర్ ఎన్. కిషోర్‌రెడ్డికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చేనేత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారికి మారుతున్న కాలానుగుణంగా నూతన డిజైన్‌లలో శిక్షణ ఇచ్చి వారికి మెరుగైన ఉపాధికి తోడ్పాటునందించాలని కోరారు.

సంక్షిప్త సమాచారం

పోలింగ్ కేంద్రాల వివరాలు ఆన్‌లైన్ చేయాలి

ఆత్మకూరు(ఎం): గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల వివరాలను ఆన్‌లైన్ చేయాలని ఎంపీడీఓ రాములు నాయక్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన పంచాయతీ కార్యదర్శుల సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో సూపరింటిండెంట్ లోకేశ్వర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

మోత్కూరు : మోత్కూరు మండలం దత్తప్పగూడెం గ్రామంలో కోల కమలమ్మ (90) అనారోగ్యంతో మృతి చెందింది. బుధవారం కమలమ్మ మృతదేహాన్ని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి సందర్శించి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పొన్నబోయిన రమేష్, కె.ప్రభాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కె.యాకూబ్‌రెడ్డి, అడ్డగూడూరు మాజీ ఎంపీపీ దర్శనాల అంజయ్య, సొంమల్లు, మల్లేష్, ఎలుగు సోమయ్య, వెంకటేష్, సత్తయ్య పాల్గొన్నారు.

అడ్డగూడూరు: మండల కేంద్రంలోని మంగమ్మగూడెంలో శారద తండ్రి సంకరి సూరయ్య ఇటీవల మృతి చెందాడు. 2000-01బ్యాచ్ పూర్వ విద్యార్థులు బుధవారం బాధిత కుటుంబానికి రూ.16 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కడారి సతీష్, బోగ నాగరాజు, నిమ్మల నరసింహ, బొమ్మగాని మల్లేష్, నారబోయిన సోమన్న, కన్నెబోయిన సైదులు, మాజీ సర్పంచ్ రాంరెడ్డి,గూడెపు పాండు, కడారి రమేష్, మల్లేష్ పాల్గొన్నారు.

జిట్టా బాలకృష్ణారెడ్డి విగ్రహావిష్కరణకు రావాలి

భువనగిరి : జిట్టా బాలకృష్ణా రెడ్డి విగ్రహ నిర్మాణ కమిటీ సభ్యులు బుధవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ఈ నెల 12 నిర్వహించనున్న జిట్టా బాలకృష్ణారెడ్డి విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. అనంతరం ఎమ్మెల్సీ కోదండరాం, తీన్మార్ మల్లన్నను కలిసి విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ఆహ్వానించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు సత్తిరెడ్డి, క్రాంతిరెడ్డి, శ్రీనివాస్, సంతోష్‌రెడ్డి, నవీన్ ఉన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ జరపాలని వినతి

గుండాల : మండలంలోని సీతారాంపురం గ్రామానికి చెందిన ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ వడ్లకొండ మల్లేష్ ఉపాధి హామీ పథకంలో పలు అవినీతి, అక్రమాలకు పాల్పడ్డాడని అతడిపై విచారణ జరిపించాలని కోరుతూ గ్రామానికి చెందిన మచ్చ భాస్కర్‌రెడ్డి బుధవారం మండల పరిషత్ సూపరింటెండెంట్ దప్పు మల్లయ్యకు వినతి పత్రాన్ని అందజేశారు. ఆయన వెంట కూరెళ్ల స్వామి తదితరులు ఉన్నారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి

రామన్నపేట : విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని రామన్నపేట ఉపకోశాధికారి గంగుల పురుషోత్తంరెడ్డి అన్నారు. బుధవారం రామన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బుంగ సంజీవ, అధ్యాపకులు ప్రసునాదేవి, పున్నారావు వెంకట్‌రెడ్డి, అశోక్, నగేష్, శ్రీకాంత్, ఉపేందర్ రావు, నిర్మల, కవిత, కరుణ, పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

రామన్నపేట : మండలకేంద్రానికి చెందిన కొంపల్లి విజయానందం, లక్ష్మాపురం గ్రామానికి చెందిన గద్దం స్వామికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన చెక్కులను బుధవారం కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణకాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ జమీరొద్దీ న్, ఆకవరపు మధుబాబు, ఎండీ రెహాన్, గోదాసు పృథ్వీరాజ్, వనం చంద్రశేఖర్, బత్తుల నవీన్‌కుమార్, పాల్గొన్నారు.

రైతాంగాన్ని మోసం చేసిన కాంగ్రెస్

మోత్కూరు : కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగాన్ని మోసం చేసిందని మోత్కూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొణతం యాకూబ్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేకనే అరెస్టులంటూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను పక్కదారి పట్టిస్తుందన్నారు.

బీజేపీ కార్యాలయంపై దాడి చేసిన వారిని శిక్షించాలి



యాదగిరిగుట్ట పట్టణ కేంద్రంలో రాస్తారోకో నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

యాదగిరిగుట్ట : బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు చేసిన దాడిని ఖండిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం పట్టణ కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్ మాట్లాడుతూ బీజేపీ కార్యాలయంపై దాడి చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ రచ్చ శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి కాదూరి అచ్చయ్య, కిసాన్ మెర్చా జిల్లా అధ్యక్షులు కిషన్ నాయక్, మండల అధ్యక్షుడు గుంటిపల్లి సత్యం, ఆకుల చంద్రమౌళి, భాను చందర్, సంతోష్, నరేష్, బుచ్చిబాబు, అశోక్, వీరేష్, కర్ణ, అజయ్, సరేష్,శ్రీను, శ్రీకాంత్, దేవేందర్, శ్రీశైలం, శ్యామ్, శివ అజయ్ అనిల్, ప్రమోద్ పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో రాస్తారోకో

భూదాన్‌పోచంపల్లి : బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడాన్ని నిరసిస్తూ బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో బుధవారం పట్టణ కేంద్రంలోని నేతాజీ చౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ బీజేపీ కార్యాలయంపై దాడి చేసిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు డబ్బీకార్ సాహేశ్, అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణ, కిసాన్‌మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి సుర్కంటి రంగారెడ్డి, నాయకులు చెరుకు వెంకటేశం, తండ రమేశ్, మేకల చొక్కారెడ్డి, ప్రభాకర్, బైరు వెంకటేశం, చెరుకు రాము, ఒంటెద్దు సత్యం, గంగపురం శ్రవన్, భారత బాలరాజు, జ్ఞానేశ్వర్, సిద్దు, శ్రీకాంత్, గంగదేవి విజయ్, భగవంత్‌రెడ్డి పాల్గొన్నారు.



భూదాన్‌పోచంపల్లిలో..

సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం

రాజాపేట : బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడాన్ని నిరసిస్తూ బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని గాంధీ సెంటర్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో యువమోర్చా మండల అధ్యక్షుడు మార్క శివ యాదవ్, సంగెం వేణు, బీమగాని శివ, బొమ్మగాని వెంకటేష్, రవి, గణేష్, నాగేష్, సింహాద్రి, బాబు, కర్ణాకర్, సురేష్ పాల్గొన్నారు.

వలిగొండ : బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడాన్ని నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సీఎస్ రెడ్డి, జిల్లా కార్యదర్శి కొప్పుల యాదిరెడ్డి, నాయకులు బంధారపు లింగస్వామి, రాచకొండ కృష్ణ, బొడిగే ఆనంద్, బచ్చు శ్రీనివాస్, కణతాల అశోక్ రెడ్డి, మంద నరసింహ, మైసొల్ల మచ్చ గిరి, లోడే లింగస్వామి, దయ్యాల వెంకటేశం, రాంచంద్రమ్, రంజిత్ రెడ్డి పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సంస్థాన్ నారాయణపురం : సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

సంస్థాన్ నారాయణపురం: బీజేపీ రాష్ట్ర కార్యాలయంపై కాంగ్రెస్ పార్టీ నాయకులు దాడి చేయడాన్ని నిరసిస్తూ బీజేపీ, బీజేవైఎం ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. అంతకు ముందు మండల కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బచ్చనబోయిన దేవందర్, భాస్కర్ నరసింహ, దాసోజు వెంకటాచారి, వంగరి రఘు, తంగెళ్ల సత్తయ్య ,నందగిరి జగత్ , గడ్డం స్వామి, జక్కర్తి భిక్షపతి, గిరిబాబు, లక్ష్మీనారాయణ, శ్రీను, రాములు, శ్రీను పాల్గొన్నారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

రాజాపేట : తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) న్యూఇయర్ క్యాలెండర్‌ను బుధవారం ఎమ్మార్సీ కార్యాలయ ఆవరణలో ఎంఈఓ చందా రమేష్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్షుడు దుడుకు జానయ్య, ప్రధాన కార్యదర్శి పున్న సత్యానంద్, జిల్లా బాధ్యులు పలుగుల రాజు, తమ్మలి శ్రీహరి, కటుకం నాందేవ్, వెంకటేశ్వర్లు, నారాయణ, బాలరాజు, క్రాంతి, రామలింగరాజు, శ్రావణి, శ్రీలత పాల్గొన్నారు.



చౌటుప్పల్ : న్యూఇయర్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఏటీఓ, ఎస్టీఓ, తదితరులు

చౌటుప్పల్ : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను బుధవారం పట్టణ కేంద్రంలోని ఎస్టీఓ కార్యాలయ ప్రాంగణంలో ఏటీఓ కృష్ణమోహన్, ఎస్టీఓ శ్రీనివాస్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం మండల ప్రధాన కార్యదర్శి కానుగుల వెంకటయ్య , జిల్లా కమిటీ సభ్యుడు భీమిడి మోహన్‌రెడ్డి, ప్రతినిధులు ఎం.రాజయ్య, రజాక్, ఆగయ్య, బుచ్చయ్య, కృష్ణయ్య, ఎస్.కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

భువనగిరిటౌన్ : కాంగ్రెస్ పార్టీ మాజీ కౌన్సిలర్ లయిఖ్అహ్మద్ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను బుధవారం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

11న సంక్రాంతి క్రీడా ఉత్సవాలు



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కవిత

మోత్కూరు: సంక్రాంతి పండుగ పురస్కరించుకుని మోత్కూరు మున్సిపల్ ఆధ్వర్యంలో ఈ నెల 11న ముగ్గులు, క్రీడా ఉత్సవాలను నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవిత తెలిపారు. బుధవారం స్థానికంగా నిర్వహించిన మున్సిపల్ కౌన్సిల్ ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడారు. ముగ్గుల పోటీలు, కబడ్డీ, వాలీబాల్, షటిల్ పోటీలు నిర్వహించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో కమిషనర్ శ్రీకాంత్, వైస్ చైర్మన్ బొల్లేపల్లి వెంకటయ్య, కౌన్సిలర్లు పురుగుల వెంకన్న, కూరెళ్ల కుమార్, వనం స్వామి, కళ్యాణ్ చక్రవర్తి, కారుపోతుల శిరీష, లెంకల సుజాత, మలిపెద్ది రజిత, ఎర్రబెల్లి మల్లమ్మ, విజయ పాల్గొన్నారు.

క్రీడాస్థలం పరిశీలన

క్రీడా ఉత్సవాల కోసం స్థానిక కస్తూర్బా పాఠశాల వద్ద గల గ్రౌండ్‌ను మున్సిపల్ కౌన్సిల్ సభ్యులతో పాటు అఖిలపక్షం నాయకులు పరిశీలించారు. వారిలో గుర్రం లక్ష్మీనర్సింహారెడ్డి, అవిలుమల్లు, కొణతం యాకూబ్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, దామరోజు సత్యనారాయణచారి, సోమయ్య, రామచంద్రు గౌడ్, బయ్యని రాజు, మల్లేష్, సమ్మయ్య ఉన్నారు. క్రీడోత్సవ కరపత్రాలను ఎమ్మెల్యే మందుల సామేలు బుధవారం రాత్రి స్థానిక రహదారి బంగ్లాలో ఆవిష్కరించారు.

మహిళ అదృశ్యం

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండలంలోని ధర్మోజిగూడెంలో నివాసముంటున్న జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన మహిళ అదృశ్యమైనట్లు ఆమె భర్త బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన రూబినా(27) తన భర్త పవన్‌కుమార్‌తో కలిసి నాలుగేళ్ల క్రితం చౌటుప్పల్‌కు వలస వచ్చి ధర్మోజిగూడెంలో నివాసముంటున్నారు. పవన్‌కుమార్ మేస్త్రీగా పనిచేస్తుండగా, రూబినా పా నీపూరి తయారుచేసే కుటీర పరిశ్రమలో పనిచేస్తోంది. గత వారం రోజులుగా తన భార్య రూబినా కనిపించడంలేదని, పానీపూరి తయారుచేసే పరిశ్రమ నిర్వాహకుడు మహదేవ్‌సింగ్ మీద అనుమానం ఉందని ఆమె భర్త పవన్‌కుమార్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణమాల్ సూర తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

భువనగిరిటౌన్ : తాళం వేసి ఉన్న ఇంట్లోకి గుర్తుతెలియని దుండగులు చోరబడి చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన భువనగిరిలో పట్టణంలో గంజ్ హైస్కూల్‌లో సమీపంలోని ఓ ఇంట్లో జరిగింది. వివరాల ప్రకారం.. పట్టణ కేంద్రానికి చెందిన టింగరి జగదీశ్ కుటుంబ సభ్యులు బుధవారం సమీప బంధువుల ఇంటి వెళ్లారు. తిరిగి సాయంత్ర వచ్చే సరికి ఇంటి తలుపులు పగలగొట్టి ఉన్నాయి. ఇంట్లో ఉన్న 3 తులాల బంగారం చోరీ గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రతి ఎకరాకు నీరందించడమే లక్ష్యం : ఎమ్మెల్యే కుంభం

భువనగిరి: ప్రతి ఎకరాకు సాగు నీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి అన్నారు. కొండపోచమ్మ సాగర్ నుంచి తుర్కపల్లి కాల్వ ద్వారా సాగు నీటిని విడుదల చేసిన సందర్భంగా ఆయన పల్లెపహాడ్ గ్రామం వద్ద పూజలు చేశారు. ఈ సందర్భంగా వడపర్తి, హన్మాపురం తాజ్‌పూర్, భువనగిరి చెరువు ద్వారా మండలంలోని పలు గ్రామాలకు వడపర్తి కత్వ ద్వారా బీబీనగర్ చెరువుకు సాగు నీరు వెళ్లే కాల్వను పరిశీలించారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేస్‌చిస్తి, మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వర్లు, నాయకులు ఎలిమినేటి కృష్ణారెడ్డి, పాశం శివానంద్, కృష్ణ, చిక్కుల వెంకటేశం, ఫక్కీర్ కొండల్‌రెడ్డి తదితరులున్నారు.

లైజన్ అధికారి జీతం చెల్లింపుపై పునరాలోచన చేయాలి

యాదగిరిగుట్ట : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపు కాంట్రాక్ట్ ప్రాతిపదికన టీటీడీ ఆఫీసర్ ఆన్-స్పెషల్ డ్యూటీ (లైజన్ ఆఫీసర్) గా నియమించిన సి.గణేష్ కుమార్ కు యాదగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థాన నిధుల నుంచి వేతనం ఇవ్వడం పట్ల ప్రభుత్వం పునరాలోచన చేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య కోరారు. టీటీడీ లైజన్ అధికారికి యాదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయం నుంచి జీతం ఇవ్వొద్దని కోరుతూ బుధవారం సచివాలయంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, దేవాదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ శ్రీధర్‌లను వేర్వేరుగా కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్ గౌడ్, చొల్లేరు మాజీ సర్పంచ్ తోటకూరి బీరయ్య, పట్టణ జనరల్‌సెక్రటరీ పాపట్ల నరహరి, బీసీ విభాగం మండల అధ్యక్షుడు కవిడె మహేందర్ పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

అర్చకుల వేతనాలు చెల్లించాలి

అడ్డగూడూరు : ధూప దీప నైవేద్య అర్చకుల వేతనాలను వెంటనే విడుదల చేయాలని ధూప దీప నైవేద్య అర్చకుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి వల్లంభట్ల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు నెలలుగా ధూప దీప నైవేద్య అర్చకులకు వేతనాలు అందడం లేదన్నారు. వేతనాలు అందక అర్చకులు ఇబ్బందులు పడుతున్నామన్నారు. దేవాదాయ శాఖ అధికారులు స్పందించి అర్చకుల వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.